తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 129 పేజీలు: 10+4 వెల: 6.50




సేవ, దేశహితం పట్ల అచంచల నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన, ప్రజా సంక్షేమాన్నే జీవిత సాధనగా భావించే సేవకుడు శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో భారత్ నిరంతర ప్రగతిని సాధిస్తోంది. ఈ విషయాన్ని యావత్ దేశం గర్వంగా చెబుతోంది.

## 12 విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి 12 ఏళ్లు

### పేదల సంక్షేమం

- 81 కోట్లకు పైగా ప్రజలకు ప్రతి నెల ఉచిత రేషన్ పంపిణీ
- 4 కోట్లకు పైగా పీఎం ఆవాస్ గృహాలు, 10.5 కోట్లకు పైగా ఉజ్వల ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు, 12 కోట్లకు పైగా మరుగుదొడ్ల నిర్మాణం ద్వారా సులభతర జీవనం

### యువశక్తి

- దాదాపు 2 కోట్ల మంది యువతకు నైపుణ్య శిక్షణ
- ముద్ర పథకం కింద రూ.40 లక్షల కోట్ల రుణాలు
- దేశవ్యాప్తంగా 2.2 లక్షల అంకుర సంస్థలు
- ఆవిష్కరణలను ప్రోత్సాహిస్తున్న 10,000+ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు

### రైతు సంక్షేమం

- పీఎం-కిసాన్ పథకం కింద రూ.4.3 లక్షల కోట్ల ఆర్థిక సాయం
- 4 కోట్లకు పైగా రైతులకు రూ.2 లక్షల కోట్ల పంట బీమా రక్షణ
- కనీస మద్దతు ధరపై రూ.26 లక్షల కోట్లకు పైగా విలువైన పంటల కొనుగోలు
- 8 కోట్ల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరు

### మహిళా సాధికారత

- 32 కోట్లకు పైగా మహిళలకు జన్‌ధన్ ఖాతాల ప్రారంభం
- సాయుధ దళాల్లో మహిళలకు శాశ్వత కమిషన్
- 3 కోట్లకు పైగా 'లఖ్‌పతి దీదీలు'
- 91+ లక్షల స్వయం సహాయక సంఘాల ద్వారా 10 కోట్ల గ్రామీణ మహిళల సాధికారత

### ఆరోగ్యం

- 70+ సంవత్సరాల వృద్ధులకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స
- 60+ కోట్ల ప్రజలకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య రక్షణ
- దేశవ్యాప్తంగా 19,000+ జనఔషధి కేంద్రాల ద్వారా 90 శాతం వరకు తక్కువ అందుబాటు ధరల్లో మందులు

### మధ్యతరగతి

- వార్షిక ఆదాయం రూ.12.75 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు
- ఉడాన్ పథకం కింద 1.6+ కోట్ల ప్రయాణీకులకు అందుబాటు ధరల్లో విమాన ప్రయాణం
- ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 151 శాతం పెరిగి దాదాపు 1.3 లక్షలకు చేరిక

### దేశ నిర్మాణం

- 26 నగరాల్లో 1,100+ కిలోమీటర్లకు విస్తరించిన మెట్రో రైలు నెట్‌వర్క్
- దేశవ్యాప్తంగా 164 వందే భారత్ రైళ్లు సేవలు
- అటల్ సేతు, సుదర్శన్ సేతు, చినాబ్ రైలు వంతెన, బోగీబీల్ వంతెన, పంబన్ సముద్ర వంతెన వంటి మహత్తర మౌలిక సదుపాయాల నిర్మాణం
- విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 164కు పెరుగుదల

### దేశమే ప్రథమం

- దాదాపు రూ.38,400 కోట్ల విలువైన రికార్డు స్థాయి రక్షణ ఎగుమతులు
- నక్సల్ రహిత భారత లక్ష్యం సాకారం దిశగా ముందడుగు, ఉగ్రవాదంపై కఠిన చర్యలు
- వలసవాద మనస్తత్వం నుంచి విముక్తి-రాజ్‌పథ్‌కు బదులుగా కర్తవ్య పథ్, ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో భారత నౌకాదళానికి కొత్త జెండా

### వారసత్వం-వికాసం

- అయోధ్యలో భవ్య శ్రీరామ మందిర నిర్మాణం
- కాశీ విశ్వనాథ్ ధామ్, మహాకాళ్ మహాలోక్, కేదార్‌నాథ్ ధామ్‌ల పునరుద్ధరణ, సమగ్ర అభివృద్ధి



CBC 46101/13/0005/2627

# లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

### నింబోలిఅడ్డాలో బాబూజగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహం
### ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో కలిసి స్థలాలను పరిశీలించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్, బాబూజగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహ నిర్మాణాలు మైలురాళ్లుగా నిలవనున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని, సమాజంలో అణగారిన వర్గాల నాయకత్వ స్థానాలకు చేరుకోగలవని స్పష్టం చేశారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో ప్రతిపాదిత అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణ స్థలాన్ని, అనంతరం నింబోలిఅడ్డాలో ఆధునికరించనున్న బాబుజగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతిగృహ స్థలాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్య మంత్రి మాట్లాడుతూ.. అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ కోట్లాది మంది దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల యువత భవిష్యత్తును తీర్చిదిద్దే విజ్ఞాన సౌధ మని పేర్కొన్నారు. 10 అంతస్తుల్లో నిర్మించనున్న ఈ టవర్‌లో డిజిటల్ లైబ్రరీలు, ఈ లెర్నింగ్ సెంటర్లు, పరి శోధన విభాగాలు, పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాలు, కాన్ఫరెన్స్ హాల్స్, కెరీర్ గైడెన్స్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసి, హైదరాబాద్‌లోని నిష్ణాతులైన అధ్యాపకుల బోధనను ప్రత్యక్షంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అందించ నున్నట్లు వెల్లడించారు. విద్య కోసం హైదరాబాద్‌కు రాలేని విద్యార్థులకు వారి ప్రాంతాల నుంచే ఉన్నతవిద్య అవకాశాలను అందించే వ్యవస్థను ప్రభుత్వం రూపొందిస్తోందన్నారు. నింబోలి అడ్డాలోని చారిత్రక విద్యార్థి వసతిగృహాన్ని ప్రస్తావిస్తూ ఇది కేవలం ఒక హాస్టల్ మాత్రమే కాదని, వేలాది మంది పేదవిద్యార్థుల కలలకు ఆశ్రయం కల్పించిన సామాజిక పరివర్తన సజీవ సాక్ష్యం మన్నారు. ఈ హాస్టల్‌లో ఉండి చదివిన వారు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, రాజకీయ నాయకులుగా, న్యాయవాదులుగా, విద్యావేత్తలుగా, వ్యాపారవేత్తలుగా ఎదిగి సమాజానికి సేవలందించారని గుర్తు చేశారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ .. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో దళిత, గిరిజన, బడుగు బలహీనవర్గాల విద్యా అభ్యున్నతికి లోయర్ ట్యాంక్‌బండ్‌లో రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని, నింబోలిఅడ్డాలో సుమారు రూ.25 కోట్లతో అత్యాధునిక వసతులతో బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. తన హయాంలో ఈ రెండు చారిత్రాత్మక ప్రాజెక్టులకు నిధులు కేటాయించి కార్యరూపం దాల్చడం జీవితంలో గర్వకారణమైన ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. కార్య క్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ఆర్ అండ్ బి సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎస్‌ఈ నర్సింగరావు, ఈఈ మనోహర్, ఆర్వోవో సాయిరాం, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## బిసి గురుకుల జూనియర్ కాలేజీల అడ్మిషన్ల రెండోదశ మెరిట్ జాబితా విడుదల

### 10లోగా కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీసీ గురుకుల జూనియర్ కాలేజీల (ఆర్‌జేసీ) అడ్మిషన్లకు సంబంధించి రెండవ దశ మెరిట్ జాబితాను సోమవారం విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీ గురుకుల విద్యా సంస్థ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు సంబంధించి రెండవ దశ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు బీసీ గురుకుల సొసైటీ ఇన్‌చార్జ్ సెక్రటరీ డాక్టర్ మల్లయ్య బట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తమ ఎంపిక వివరాలను గురుకుల సొసైటీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. 10వ తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. రెండో దశలో ఎంపికైన విద్యార్థులు అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంబంధిత కాలేజీల్లో ఈ నెల 10 వరకు అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మల్లయ్య బట్టు తెలిపారు.

## భారీగా పెరిగిన టమోటా ధరలు

### కిలో రూ.60కి చేరిన రేటు
### వర్షాలతో దెబ్బతిన్న కూరగాయల తోటలు
### మరోపక్క పెరిగిన రవాణా ఛార్జీలు

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** దేశంలో మరోసారి టమోటా ధరలు భగ్గుమంటున్నాయి. రుతు పవనాల ప్రభావంతో పలు రాష్ట్రాలలో వర్షాలు పడుతుండటంతో టమోటా సహా కూరగాయల తోటలు దెబ్బతింటుండం, దిగుబడి, రవాణా సమస్యల నేపథ్యంలో వాటి ధరలు పెరిగిపోతున్నాయి. తెలంగాణలో అయితే టమోటా ధరలకు రెక్కలొచ్చాయి. నిత్యం వంటల్లో వాడే టమాటా ధరలు ఒక్కసారిగా భారీగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల పై పెను భారం పడుతోంది. కేవలం రెండు వారాల వ్యవధిలోనే ధరలు రెట్టింపు కావడంతో మార్కెట్కు వెళ్లే వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. బెంగళూరుతో పాటు దాని చుట్టుపక్కల జిల్లాల్లో గత రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కూరగాయల పంటలు, ముఖ్యంగా టమాటా తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనికి తగినట్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. ప్రస్తుతం కేజీ టమాటా ధర రూ. 60 పలుకుతోంది. గుడిమల్కాపూర్ మార్కెట్లో రెండు వారాల క్రితం వరకు కిలో రూ. 20 నుంచి రూ.25 పలికిన టమాటా ధర, ఇప్పుడు ఏకంగా కిలో రూ. 40 నుంచి రూ. 55 కి చేరింది. ఇక నాణ్యమైన బెంగళూరు టమాటా ధరలు అయితే ఏకంగా రూ. 80 నుంచి రూ.100 వరకు పలుకుతుండటంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరల్లో టమాటా వేయాలంటేనే భయపడాల్సి వస్తోందని సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఇక గత రెండు వారాల నుంచి బెంగళూరు సహా చుట్టుపక్కల జిల్లాల్లో వానలు పడుతున్నాయి. ఇటు తెలంగాణలో వానలు పడుతుండటంతో టమాటా దిగుబడులపై ఎఫెక్ట్ పడుతుంది. టమాటా సహా కూరగాయల పంటలు దెబ్బతింటూ దిగుబడులు పడిపోతున్నాయి. వానాల కారణంగా ఆకు కూరలు, బజ్జి మిరప, దోస, అనప, కాకర, టమాటా, కొత్తిమీర ధరలు పెరిగాయి. అటు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా చార్జీలు కూడా పెరిగాయి. హైదరాబాద్ వచ్చే టమాటాలలో బెంగుళూరు టమాటా కూడా కీలకం కావడంతో క్రమంగా స్థానిక మార్కెట్ లలోనూ టమాటా ధరలకు రెక్కలు వస్తున్నాయి. వానలు మరింత ముదిరితే టమాటా దిగుబడులు పడిపోయి ధరలు మరింత పెరుగవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక మిగిలిన కూరగాయల పరిస్థితి చూస్తే ప్రస్తుతం చిక్కుడు రూ.120, బీరకాయ రూ.105, బెండకాయ రూ.85, పచ్చిమిర్చి రూ.70, వంకాయ రూ.75, గోకర రూ.75, చామగడ్డ రూ.75, దొండకాయ రూ.60, క్యాబేజీ రూ.65, కీర రూ.60, టమాట రూ.54, దోసకాయ రూ.55కి కాస్తా అటుఇటుగా విక్రయిస్తున్నారు.

## తుమ్మిడిహెట్టికి ఒప్పుకొన్న నిర్మాణంపై బిఆర్ఎస్ నిర్లక్ష్యం

### ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి

**హైదారబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును 150మీటర్ల ఎత్తుతో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకున్నా గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం దానిని పట్టించుకోలేదని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. సోమవారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహా రాష్ట్ర గవర్నర్‌గా తెలంగాణకు చెందిన చెన్నమనేని విద్యాసాగర్ రావు ఉన్నారని ఆయన్ని కూడా నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఉపయోగిం చుకోలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన సమయంలో 600 ఎంజిడి వాటర్ సప్లై హైదరాబాద్ మహానగరానికి ఉందన్నారు. పదేళ్లలో ఒక్క ఎంజిడి వాటర్ కూడా హైదరాబాద్‌కు బిఆర్ఎస్ తీసుకు రాలేదని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి కెనాల్ నిర్మాణం చేయకుండా 90 శాతం పనులు పూర్తయ్యాయని బిఆర్ఎస్ పార్టీ గోబెల్స్ ప్రచారం చేస్తుందని యెన్నం ఆవేదన చెందారు. డిపిఆర్‌లో సగం బడ్జెట్ కూడా ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులు చేయడం సాధ్యమా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. భూబకాసురల విషయంలో హిట్లర్‌గా సిఎం కఠినంగా ఉంటాననీ చెప్పారనీ దానికి పెడ అర్థాలు తీయడం తగదని అని యెన్నం అన్నారు. హిట్లర్ కంటే కఠినంగా ఉంటామని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ గతంలో వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఆ సమయంలో బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. నాడు కెసిఆర్ మాట్లాడిన మాటలనే నేడు సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారనీ స్పష్టం చేశారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత కోసం ప్రత్యేక పథకాలు రూపొందించాలి

### 16, 17 తేదీల్లో యువజన సమ్మేళనం
### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదారబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో యువజన సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యురాలు టి జ్యోతి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి యాదయ్య, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్య క్షులు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం చంద్రమోహన్, జగదీష్‌తో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మా ట్లాడుతూ.. హైదరాబాద్ కొత్తపేటలోని బీజేఆర్ భవన్‌లో యువజన సమ్మేళనాన్ని ఈ నెల 16,17 తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవిష్యత్‌పై దృష్టి పెట్టడం లేదనీ, యువ శక్తిని నిర్వీరం చేస్తున్నాయని విమర్శించారు. అందుకే యువత నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 60 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయనీ, ఒక్క రైల్వే శాఖలోని 10 లక్షల ఖాళీలున్నాయన్నారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవటం వల్ల దళితులు, ఆదివాసీ గిరిజనులు, బీసీలు నష్టపోతు న్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వమూ ఉద్యోగాల భర్తీలో నిరక్ష్యం వహిస్తున్నదనీ, అధికారం చేపట్టిన యేడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీని బుట్టదాఖలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 17 వేల పోస్టులను మాత్రమే భర్తీ చేసిందనీ, గత ప్రభుత్వం వేసిన నోటిఫికేషన్లను క్లియర్ చేసి తన ఖాతాలో వేసుకుంటున్నదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల భర్తీ విషయంలో యువతను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. యువత మానసిక, ఆర్థిక ఒత్తిళ్లకు తట్టుకోలేక వ్యసనాలకు అలవాటు పడుతున్న పరిస్థితి ఉందనీ, రాష్ట్రంలో రాజకీయ అండదండలతోనే డ్రగ్స్ దందా సాగుతున్నదని విమర్శించారు. దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక పాలసీలు లేవనీ, దీంతో ప్రపంచ క్రీడల్లో మన క్రీడాకారులు వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే యువత సమస్యలపై చర్చించేందుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో యువజన సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే సమ్మేళనంలో యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# పోలీసు విభాగాల సరిహద్దులు, స్టేషన్ల పరిధులపై ప్రణాళిక

### నేపాల్ పనివాళ్లపై పూర్తి వివరాలు సేకరించాలి
### పోలీసింగ్‌లో సాంకేతికతను మరింత వాడాలి
### ఉన్నతాధికారుల సమావేశంలో డిజిపి ఆనంద్ ఆదేశం



పోలీసు ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న డిజిపి ఆనంద్. చిత్రంలో హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖాగోయల్, పోలీసు అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్ తదితరులు

**హైదారబాద్ జూన్ 8, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, కమిషనరేట్లకు సంబంధించిన సరిహద్దులు, పోలీసు స్టేషన్ల పరిధులపై సమగ్ర ప్రణాళికను రూపొందించాలని డిజిపి సి.వి ఆనంద్ ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు రాష్ట్రంలో నేపాల్‌కు చెందిన పని మనుషులు దొంగలుగా మారుతూ నేరాలకు పాల్పడుతున్న క్రమంలో వారికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించాలని, దీంతో పాటు పో లీసింగ్‌లో సాంకేతికను మరింత వాడాలని ఆయన కోరారు. డిజిపి కార్యాల యంలో కీలక అంశాలపై సి.వి ఆనంద్ సోమవారం నాడు ఉన్నతా ధికారు లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పలు చోట్ల జిల్లాలు, కమిషనరేట్ల సరిహద్దులు, పోలీసు స్టేషన్ల పరిధులపై తరచూ వివాదాలు వస్తుండడం సరికాదని, వీటికి వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలని ఆయన కోరారు. ఇటీవల జంట నగరాలు, శివార్లలో కొత్త జోన్లు రావడం, పాత జోన్లలోని కొన్నింటిని మరోదాంట్లో కలపడం వల్ల సమస్యలు వస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఈ క్రమంలో జి ల్లాలు, కమిషనరేట్ల సరిహద్దులు, పోలీసు స్టేషన్ల పరిధులపై వెంటనే సమగ్రంగా పరిశీలన చేసి పూర్తిస్థాయిలో ప్రణాళికను రూపొందించాలని ఆయన ఆదేశించారు.

ఇందులో సర్కిళ్లు, జోన్లు, గ్రామాల పునర్విభజన వంటి అంశాలు వివరంగా వుండాలని ఆయన ఆదేశించారు. ఈ విషయంలో పక్కా సమాచారం వుండాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో నేపాల్‌కు చెందిన పని మనుషులు పలుచోట్ల ఇళ్లలో పని చేస్తూనే దోపిడీలకు పాల్పడడం, కొన్నిచోట్ల హత్యలకు దిగడం వంటి ఘటనలు కలవరానికి గురిచేస్తు న్నాయని డిజిపి తెలిపారు. ఇందుకుగానూ రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్ల నేపాల్‌కు చెందిన పనివాళ్లు ఎంత మంది వున్నారు...? వీరంతా ఎక్కడ వున్నారు...? వీరి గత చరిత్ర ఏమిటీ...? నేపాల్‌లో ఏ ప్రాంతానికి చెందిన వారు...? అనే వివరాలు సమగ్రంగా తయారు చేయాలని డిజిపి ఆదేశించారు.

**పోలీసింగ్‌లో సాంకేతికను మరింత వాడాలి**

రాష్ట్రవ్యాప్తంగా పోలీసింగ్‌లో సాంకేతికను మరిం తగా వాడాలని డిజిపి ఆదేశించారు. టెక్నాలజి ఆధారిత పోలీసింగ్ ద్వారా కోర్ అప్లికే షన్లు, సిసిటిఎన్ఎస్ 2.0 అమలు, టిజి కాప్స్ వ్యవస్థ వినియోగంపై డిజిపి ఉన్నతాధికారులతో చర్చించి కీలక ఆదేశాలు జారీ చేశారు. డయల్ 100 , రౌడీ షీటర్లపై నిఘా, చోరీ వాహనాల ఆచూకీ కనుగొనడం, హిస్టరీ షీటర్ల డేటా వంటి అంశాలను టెక్నాలజి వాడడం ద్వారా వేగంగా చేబట్టవచ్చని డిజిపి తెలిపారు. దీంతో పాటు ఏఐ ఆధారిత పోలీసింగ్, డ్రోన్ల వాడకం, హెచ్‌ఆర్ఎంఎస్ డేటా ఇంటెలిజెన్స్, స్మార్ట్ అప్లికేషన్ల విని యోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిజిపి సూచించారు. "తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ యూజింగ్... యూజింగ్ టెక్నాలజీ" అనే లక్ష్యంతో పోలీసులు ముందుకు సాగాలని ఆయన తెలిపారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, వెహికల్ ఆడిట్, సిబ్బంది వినియోగం, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపైనా ఎలా వ్యవహరించాలనే దానిపై డిజిపి సూచనలు చేశారు. భవిష్యత్తులో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు బ్యూరోతో పాటు ఆహార కల్తీ నిరోధకానికి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సి న అవసరం వుందని డిజిపి పేర్కొన్నారు. ఈ సమావేశంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, పోలీసు అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్, నిఘా విభాగం చీఫ్ విజయ్ కుమార్, టెక్నికల్ సర్వీస్ డిజి శ్రీనివాసరావు, హోంగార్డుల విభాగం డిజి స్వాతి లక్రా, సిటీ కొత్వాల్ సజ్జన్నార్, గ్రే హౌండ్స్ డిజి అనిల్ కుమార్, మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ కొత్వాల్ డాక్టర్ తరుణ్ జోషి, పి అండ్ ఎల్ ఐజి డాక్టర్ గజారావు భూపాల్, సైబరాబాద్, మల్కాజిగిరి కమి షనర్లు రమేష్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

## 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలి

### టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) వర్తింపజేయాలి లని టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్ చేశారు. డీఎస్సీ 2003 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు బేషరతుగా పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత అభ్యర్థుల డిమాండ్ నెరవేరే వరకు, వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటానన్నారు. డీఎస్సీ 2003 నియామక ప్రక్రియ జనవరి 1, 2004 కంటే ముందే ప్రారంభమైనప్పటికీ, పరిపాలనా, విధానపరమైన జాప్యాల కారణంగా పలువురు అభ్యర్థుల నియామకాలు జనవరి 1, 2004 తర్వాత పూర్తయ్యాయని గుర్తుచేశారు. అందువల్లే వారి తప్పేమీ లేకపోయినా వారిని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోకి తీసుకువచ్చారన్నారు. బాధిత ఉపాధ్యాయుల నిరసనలతో ఏకీభవించి రాష్ట్ర హైకోర్టు కూడా వారి వాదనలను సమర్థించి, 20003 డీఎస్సీ అభ్యర్థులకు ఓపీఎస్ ప్రయోజనాలు కల్పించాలని ఆదేశించినప్పటికీ.. ఆ తీర్పును అమలు చేయకుండా ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేయడం విచారకరమని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికైనా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ విధానం అమలు చేయాలన్న కోర్టు తీర్పును గౌరవించాలన్నారు. ఉపాధ్యాయుల భవిష్యత్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. అలాగే సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలు స్పౌజ్, మ్యూచివల్ బదలీలు, వేతనాల పెంపు, హెల్త్ కార్డులు, కనీస వేతనాల అమలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కోరారు.

## నెలాఖరులోగా పిఆర్‌సి నివేదిక ప్రకటించాలి

### ప్రభుత్వ పాఠశాలలను కుదించాలనే ఆలోచనను విరమించుకోవాలి
### టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదారబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** జూన్ నెలాఖరులోగా పిఆర్‌సి నివేదిక ప్రకటించాలని, ప్రభుత్వ పాఠశాలలను కుదించాలనే ఆలోచనను విరమించుకోవాలని టియస్‌యుటిఫ్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జూన్ 2 లోపు ఇస్తామన్న పిఆర్సీ నివేదిక ఇంకా విడుదల కాలేదని, కనీసం జూన్ నెలాఖరులోపు పిఆర్‌సి నివేదిక తెప్పించుకొని పిఆర్‌సి ప్రకటించకపోతే జూలైలో పోరాటం చేస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటిఎఫ్ ) రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అధ్యక్షతన సోమవారం రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. సమావేశంలో చావ రవి మాట్లాడుతూ.. ప్రభుత్వం నియమించిన రెండో పిఆర్‌సి 35 నెలలు గడిచినప్పటికీ నివేదిక సమర్పణ కాలేదన్నారు. జూన్ నెలాఖరులోగా నివేదిక అమలు చేయకుండా తాత్సారం చేస్తే జులై నెలలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి.. పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక ప్రైవేటు ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 27 వేల పాఠశాల నుంచి 4 వేల పాఠశాలలకు కుదించాలన్న నిర్ణయం సరైంది కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ బడులపై ప్రజలకు నమ్మకం కలిగించి ప్రభుత్వ బడులను కాపాడాలన్నారు. ఎన్‌రోల్‌మెంట్ పెంచడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకట్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా స్పెషల్ టెట్ నిర్వహించాలని, క్వాలిఫై మార్క్స్ తగ్గించాలని డిమాండ్ చేశారు.

## పారదర్శకంగా ఎరువుల పంపిణి

### మీసేవ, టెలిఫోన్ ద్వారా కూడా బుకింగ్
### అన్నిరకాల ఎరువులు యాప్ ద్వారా కేంద్రం సరఫరా: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదారబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సకాలంలో, పారదర్శకంగా ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, సమర్థత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో యూరియా యాప్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో తెలంగాణలో విజయవంతంగా అమలవుతున్న రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్‌ను పొరుగు రాష్ట్రాలు కూడా రూపొందించే దిశగా చర్యలు చేపడుతున్నా యన్నారు. దేశవ్యాప్తంగా ఎరువుల పంపిణీ వ్యవస్థను విస్తరించేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఈ వానాకాలం నుండి పలు రాష్ట్రాల్లోని పైలట్ జిల్లాల్లో కేంద్ర ఎరువుల యాప్ ఎఫ్ఎస్ఎఎస్‌ను అమలుచేయనుందన్నారు. జిల్లా వారీగా డీలర్ల స్టాక్ నిర్ధారణకు షెడ్యూలింగ్ వ్యవస్థ, మండల మ్యాపింగ్ సదుపాయం, మీ సేవ కేంద్రాలు, టెలిఫోన్ ద్వారా ఎరువుల బుకింగ్ విధానం, రైతుల సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు.

ఎరువుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సి న పరిస్థితులు తగ్గాయని, రైతులు తమకు అనుకూలమైన సమయంలో ఎరువులు పొందగలుగుతున్నారని చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా విషయంలో ఎప్పటికప్పుడు కేంద్రంతో సమన్వయం చేసుకుంటోందన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు నెలకు 2 లక్షల టన్నుల చొప్పున మొత్తం 6 లక్షల టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించాలని కేంద్రానికి పలుమార్లు లేఖలు రాశామని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి 3.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా చేరిందన్నారు. మిగిలిన యూరియా కూడా సకాలంలో చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## జనగణనలో కులగణన జరిగితే రాహుల్ తప్పక ప్రధాని

### ప్రభుత్వ సలహాదారు వి. హన్మంతరావు

**హైదారబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** జనగణనలో కులగణన అయితే రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారు.. కేంద్రప్రభుత్వం సర్ గెజిట్‌లో మా కులాల పేర్లే లేవనీ వాటిని ప్రకటించకపోతే బిసిలకు వ్యతిరేకం బిజెపి అంటూ ప్రచారం చేస్తామని ప్రభుత్వ సలహాదారు వి.హను మంతరావు అన్నారు. గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీహార్ లో 60శాతం బిసి జనాభా ఉండగా,తెలంగాణ లో 55శాతం ఉందనీ దేశంలో 160కోట్లలో మా జనాభా ఎక్కువుందనీ కానీ సర్ గెజిట్ లో మా కులాల పేర్లే లేవనీ విమర్శించారు. బిసి ఓట్లతో గెలిచిన కిషన్ రెడ్డి బిసి లకు వ్యతిరేకంగా ఉన్నాడనీ ఆరోపించారు. రాహుల్ గాంధీ బిసిలకు అన్యాయం జరుగుతుందని గమనించారనీ సికింద్రాబాద్ లో కిషన్ రెడ్డికి బిసి ల ఓట్లు ఇక పడవనీ జోస్యంచెప్పారు.రాష్ట్రమంతా తిరిగి బిసి వ్యతిరేకి బిజెపి అని ప్రచారం చేస్తాను చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ కూడా జనగణనలో కులగణన చెయ్యాలని చెప్పారనీ గుర్తుచేశారు. బిసిలం రాజకీయాల్లోకి పనికిరామా అనిఅడిగారు. రాహుల్ గాంధీ ప్రధాని కాలేరనీ పగటి కల కంటూ ఎక్కువమాట్లాడకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నువ్వు అప్పుడే పెద్దోడివి అయిపోయావా..?అని ప్రశ్నించారు.కేంద్రమంత్రి స్టేట్మెంట్లకే పరిమితం అయ్యాడు, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రమంత్రిగా నీ పాత్ర ఉండదా అని అడిగారు. ఒక్కసారి గెలుస్తావ్ ఇంకోసారి ఓడిపోతావ్, తెలంగాణ లో ఎప్పుడు గెలిచేది కాంగ్రెస్ పార్టీ యే అని అన్నారు. ముఖ్యమంత్రిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రధానమంత్రి మోదీ దగ్గరికి తీసుకెళ్లట్లేదనీ అన్నింటికి ఆయనే అడ్డుపడుతున్నాడనీ ఆవేదన చెందారు. అభివృద్ధికి అడ్డుపడుపడే కిషన్ రెడ్డి ఓటమి కాయమనీ జోస్యం చెప్పారు. బిసి లము ఓట్లేషే మిషన్లమా అగ్రకులాల ఓట్లతోనే బిజెపి గెలుస్తోందా? బిసిలం అవసరం లేదా? బిసిల ఓట్లతోనే కేంద్రంలోనూ బిల్లులు పాస్ అవుతున్నాయనీ అన్నారు.భారతదేశ మొత్తం తిరుగుతాను 60శాతం ఓట్లున్న మేము బిజెపికి బుద్ధి చెప్తా మనీ హెచ్చరించారు. బిసిలం తిరగబడితే బిజెపి ప్రభుత్వం కూలు తుందనీ హెచ్చరించారు. మూడుసార్లు ప్రధానమంత్రి పదవి చేపట్టినా మోడీ బిసి అంటూనే బిసిలకు న్యాయం ఎందుకు చెయ్యట్లేదనీ ప్రశ్నించారు.

## విజయ డెయిరీ ముట్టడి

### 15 నుండి పాల సరఫరా బంద్
### బిల్లులు చెల్లించాలని రైతుల డిమాండ్

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విజయ డెయిరీ పరిధిలోని రైతులు ఆందోళన చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం హైదరాబాద్‌లోని విజయ డెయిరీ ప్రధాన కార్యాలయాన్ని పాడి రైతులు ముట్టడించారు. బకాయిలు చెల్లించకపోయినట్లయితే పాల సరఫరాను నిలిపివేస్తామని హెచ్చరించారు. బిల్లుల క్లియరెన్స్‌తో పాటు, ఇతర సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 15వ తేదీ నుంచి పాల సరఫరా నిలిపివేస్తామని అల్టిమేటం జారీ చేశారు. కాగా రైతులకు పాల బిల్లులు చెల్లించడంలో విజయ డెయిరీ తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. ఈ పాల బిల్లులు ఎప్పుడూ రెండు, మూడు పెండింగ్‌లో ఉంటున్నాయి. టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (టీఐబీ) ఫండ్ పంపిణీలోనూ తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీంతో పాడి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు పాలు పోసే సమయంలో ప్రతి లీటర్‌పైనా రూ.1.50ని విజయ డెయిరీ కట్ చేస్తున్నది. ఆ డబ్బులను తిరిగి జిల్లాలకు తిరిగి పంపిణీ చేయాలి. ఆ డబ్బులతో పశువుల దాణాను రైతులకు సబ్సిడీ ద్వారా అందించాలి. కానీ ఇప్పుడు ఆ ప్రక్రియ ఆగిపోయింది. దీంతో రైతులు పశువుల దాణా కొనుగోలు కోసం ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ముద్ర, తదితర లోన్ల ద్వారా పశువులను కొనుగోలు చేసిన రైతులు పాలరేట్లు సరిగా లేక, పాల బిల్లులు సకాలంలో అందక పాల రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రుణాలు రెగ్యులర్‌గా కట్టడం లేదనే విషయంపై పలు జిల్లాల్లో బ్యాంకు అధికారులు న్యాయపరమైన చర్యలు చేపట్టారు. ఇదే సమయంలో పెట్రోల్, డీజిల్ రేట్లు రోజురోజుకీ పెరిగిపోతుండటంతో మినరల్ మిక్చర్, కాల్షియం, తదితరాల దాణా ఖర్చులు పెరిగిపోయాయి. అయితే విజయ డెయిరీ మాత్రం రైతులకు చెల్లించే పాల ధర రేట్లను మాత్రం పెంచడం లేదని రైతులు చెబుతున్నారు.

# టిఎంసి పార్లమెంటరీ పార్టీ చీలిక

## ఎన్‌డియేకు మద్దతు, ప్రత్యేకంగా గుర్తించాలి

### లోక్‌సభ స్పీకర్‌కు 20 మంది ఎంపిల లేఖ

**కోల్‌కతా, జూన్ 8:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత మమతా బెనర్జీ నాయకత్వానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ చీఫ్ విప్ కకోలి ఘోష్ దస్తీదార్ నేతృత్వంలో 20 మంది లోక్‌సభ




ఎంపిలు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియేకు మద్దతు ప్రకటిస్తూ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని నిర్ణయించుకోవడంతో టిఎంసిలో సంక్షోభం మరింత ముదిరింది. ఈ పరిణామం పార్టీ పార్లమెంటరీ విభాగంలో చీలికకు దారితీసింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో పార్టీ నాయకత్వానికి ఎదురు దెబ్బ తగిలిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అక్కడ, సీనియర్ నాయకుడు సోవన్‌దేబ్ చటోపాధ్యాయను ప్రతిపక్ష నాయకుడిగా నియమించాలన్న పార్టీ అధిష్టానం నిర్ణయాన్ని 80 మంది ఎమ్మెల్యేలలో 58 మంది వ్యతిరేకించారు. అంతేకాకుండా, పార్టీ నుంచి బహిష్కరించబడిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీని ఆ పదవికి ఎన్నుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత టిఎంసిని చుట్టుముట్టిన రాజకీయ అస్థిరత ఇప్పుడు పార్లమెంటరీ స్థాయికి కూడా పాకినట్లు కనిపిస్తోంది. బిజెపికి వ్యతిరేకంగా దేశవ్యాప్త వ్యూహాన్ని రూపొందించేందుకు ఇండియా కూటమి సమావేశంలో పాల్గొనేందుకు పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ ఢిల్లీలో ఉన్న సమయంలోనే, అసమ్మతి ఎంపిల బృందం విధేతికు మద్దతు ప్రకటించడం విశేషం.

ఎన్‌డియేకు మద్దతు ఇచ్చే తమ నిర్ణయాన్ని స్పీకర్‌కు తెలియజేసినట్లు ఘోష్ దస్తీదార్ మీడియాకు వెల్లడించారు. "నాతో సహా దాదాపు 20 మంది టిఎంసి ఎంపిలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసి, ఎన్‌డియేకు అధికారికంగా మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాము" అని ఆమె పేర్కొన్నారు. లోక్‌సభలో పార్టీకి తానే చెల్లుబాటు అయ్యే చీఫ్ విప్‌గా కొనసాగుతున్నానని, పార్టీ నాయకత్వం ప్రకటించిన తదుపరి మార్పులు అవసరమైన పార్లమెంటరీ విధానం ద్వారా పూర్తి కాలేదని స్పీకర్ ముందు వాదించాలని అసమ్మతి ఎంపిలు భావిస్తున్నట్లు సమాచారం.

# రేవంత్‌రెడ్డి ఆర్‌ఎస్‌ఎస్ మూలాలు బయటపడ్డాయి

### కేరళం మాజీ సిఎం విజయన్ ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 8:** హైడ్రాపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేరళం మాజీ సిఎం పినరయి విజయన్..ఎక్స్ వేదికగా స్పందించారు, రేవంత్ రెడ్డి తన హైడ్రాకు హిట్లర్ స్ఫూర్తి అని గర్వంగా ఒప్పుకోవడం దిగ్భ్రాంతికరం. ఇది ఆయన ఆర్‌ఎస్‌ఎస్ మూలాలను, ఫాసిస్ట్ మనస్తత్వాన్ని బట్టబయలు చేస్తుంది. ఈ విషయంపై కాంగ్రెస్ అధిష్ఠానం దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలి అని ట్వీట్ చేశారు. దీంతో ఎన్నికల వేళ రేవంత్ రెడ్డి, పినరయి విజయన్ మధ్య చెలరేగిన రాజకీయ మాటల యుద్ధం ఇంకా చల్లారలేదు అని అర్థం అవుతోందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే రేవంత్ రెడ్డి హైడ్రాను ఉద్దేశించి చేసిన హిట్లర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు సమర్థిస్తున్నారు.

# 10న కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు

## పెట్రోల్, డీజల్, గ్యాస్, ధరలను వెంటనే తగ్గించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** పెంచిన పెట్రోల్, డీజల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు సీపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బిజెపి పాలనలో సామాన్యుడి బతుకు భారంగా మారిందని, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతోపాటు పప్పులు, నూనెలు, కూరగాయల వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఈ నెల 10వ తేదీన నిరసన ధర్నాలు చేపడుతున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చే దిన్ వస్తాయని చెప్పి, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జేబులకు చిల్లులు పెడుతున్నారని, కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలు ఇస్తున్న బిజెపి ప్రభుత్వం, సామాన్యులపై మాత్రం పన్నుల భారం వేస్తుందన్నారు.

# 19 నుంచి ఎప్‌సెట్ కౌన్సెలింగ్

## జూలై 10న మొదటి విడత సీట్ల కేటాయింపు

### ఆగస్టు 1 నుంచి క్లాసులు ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్‌ను ఈ నెల 19 నుంచి ప్రారంభించనున్నారు. ఈ నెల 22 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభిస్తారు. జులై 10న మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. ఆగస్టు 1 నుంచి క్లాసులను ప్రారంభించాలని నిర్ణయించారు. ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించారు. మొదటిసారిగా కన్వీనర్ కోటా (కేటగిరీ-ఏ)సీట్ల కౌన్సెలింగ్‌తోపాటు మేనేజ్‌మెంట్ కోటా(కేటగిరీ-బీ) సీట్ల కౌన్సెలింగ్ ఒకేసారి నిర్వహించబడుతుందని అధికారులు ప్రకటించారు. ఎప్ సెట్-2026 అడ్మిషన్ల కమిటీ సమావేశం సోమవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అధ్యక్షతన సమావేశం జరగగా.. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్ సెట్ అడ్మిషన్ల కన్వీనర్ శ్రీదేవసేన, ఎప్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి, క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్ సమావేశానికి హాజరయ్యారు. సమావేశం అనంతరం ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జారీ చేశారు. ఈ నెల 19 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ కోసం ఫీజు చెల్లించి స్లాట్ బుక్‌చేసుకోవాలి. ఈ నెల 22 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. ఈ నెల 25 నుంచి జులై 1 వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. జులై 4న మాక్ సీట్ అలకేషన్‌ను చేస్తారు. జులై 5 నుంచి 7 వరకు మాక్ సీట్ అలకేషన్‌లో మోడిఫికేషన్‌కు అవకాశం కల్పించారు. జులై 10న మొదటి విడత సీట్ల కేటాయింపు చేస్తారు. జులై 10 నుంచి 14 వరకు విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ జులై 17న ప్రారంభిస్తారు. జులై 18న సర్టిఫికెట్ వెరిఫికేషన్. జులై 18, 19 తేదిల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం. సీట్ల కేటాయింపు జులై 22లోపుగా చేస్తారు. జులు 22 నుంచి 24 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌కి అవకాశం కల్పించారు. జులై 25 నుంచి 28 వరకు కాలేజీల్లో నేరుగా చేరాల్సి ఉంటుంది. జులై 28 సీటు రద్దు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. కాలేజీలు తమ కాలేజీల్లో చేరిన విద్యార్థుల వివరాలను జులై 29న ప్రకటించాల్సి ఉంటుంది. జులై 31న ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్, ఆగస్టు 1 సర్టిఫికెట్ వెరిఫికేషన్. ఆగస్టు 1, 2 తేదిల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 5లోపుగా ఫైనల్‌ఫేజ్ సీట్ల కేటాయింపు చేస్తారు. ఆగస్టు 5 నుంచి 7 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 8న కాలేజీలు విద్యార్థుల వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఇంటర్నల్ స్లైడింగ్‌కి ఆగస్టు 12, 13 తేదిల్లో అవకాశం కల్పించారు. ఆగస్టు 15లోపుగా సీట్ల కేటాయింపు చేస్తారు. ఆగస్టు 16, 17 తేదిల్లో స్లైడింగ్‌లో పొందిన సీటులో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఏఐసీటీఈ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఆగస్టు 1 నుంచి క్లాసులను ప్రారంభించనున్నట్టు కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో ప్రకటించారు.

# కాలపరిమితితో పాలమూరు ప్రాజెక్టులకు కార్యాచరణ

## సౌరశక్తి వినియోగంతో ఎత్తిపోతల విద్యుత్ వ్యయాల తగ్గింపు అధ్యయనం

## ఫాస్ట్‌ట్రాక్ ఎగ్జిక్యూషన్ మోడ్‌లోకి కీలక ప్రాజెక్టులు

### సిఎం సాగునీటి పర్యటనలో తీసుకున్న కీలక నిర్ణయాలపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

**హైదరాబాద్, జూన్ 8:** మహబూబ్‌నగర్ జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రాజెక్టు వారీగా కాలపరిమితితో సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సౌరశక్తితో ఎత్తిపోతల విద్యుత్ వ్యయాలను తగ్గించేందుకు తగిన అధ్యయనం చేయాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఈనెల 4,5 తేదిల్లో మహబూబ్‌నగర్ పర్యటనలో సిఎం పరిశీలించిన ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. నీటిపారుదల సామర్థ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా సంప్రదాయేతర విద్యుత్ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా ప్రధాన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల దీర్ఘకాలంలో నిర్వహణ వ్యయాలు తగ్గడానికి పర్యావరణ హితంగా ఉంటాయనీ ఆయన అభిప్రాయపడ్డారు.

భూసేకరణ, పునరావాసం, భూనిర్వాసితుల జీవనోపాదుల కల్పన వేగవంతం చేయాలని కోరారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల విద్యుత్, కాంట్రాక్టర్ పనితీరుకు సంబంధించిన అన్ని అడ్డంకులను పరిష్కరించడానికి అత్యంత ప్రాధన్యత అంశంగా తీసుకోవాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి అన్నారు. ప్రాజెక్ట్‌లలోని ప్రతి ప్రధాన కాంపోనెంట్‌కు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌లను సమర్పించాలని ఆయన చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు భూసేకరణను వేగవంతం చేయాలని నిర్వాసిత కుటుంబాలకు పునరావాస ప్యాకేజీలు జాప్యం లేకుండా చేరేలా చూడాలని కోరారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మార్చి 2027 వరకుమోటార్లు అన్ని పనిచేయాలని పంపింగ్ స్టేషన్ల మరమ్మతులు, పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేయాలని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

నార్లాపూర్ రిజర్వాయర్ కింద కాలువ పనులు చేపట్టడంతోపాటు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌తో సహా మొత్తం ప్రాజెక్టును 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని నిర్ధేశించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన నార్లాపూర్, ఏదుల, ఉద్దండాపూర్ రిజర్వాయర్ల వల్ల నిర్వాసితులైన కుటుంబాలకు పునరావాసంతోపాటు డిసెంబర్ 2026 నాటికి కరివెన రిజర్వాయర్ వరకు మెయిన్ ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులను పూర్తి చేయాలని సూచించారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం పంప్ హౌస్‌లకు తక్షణమే విద్యుత్తు అనుసంధానం చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు.

మక్తల్‌నారాయణపేటకొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కోసం అవసరమైన దాదాపు 2,200 ఎకరాల సేకరణ ప్రక్రియను జూలై 2026 నాటికి ప్రారంభించాలని లక్ష్యం నిర్ధేశించారు. రాజీవ్ భీమా, కోయిల్‌సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలురాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను సమీక్షి ంచిన మంత్రి, స్టేజ్1 పనులకు అవసరమైన మిగిలిన 80 ఎకరాల సేకరణను జూలై 2026 నాటికి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కోయిల్‌సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి అవసరమైన మిగిలిన 167 ఎకరాల సేకరణ ప్రక్రియను మార్చి 20 నాటికి పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

జవహర్ నెట్టంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కింద అదనంగా 58 వేల ఎకరాలకు సాగునీటిని అందించడానికి అవసరమైన 534 ఎకరాల సేకరణను వేగవంతం చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఆర్‌డిఎస్, తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఫేజ్2 కోసం 567 ఎకరాల భూమి సేకరణ చేసి వెంటనే నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభించాలని అన్నారు.

# బల్దియా ఎన్నికల కోసమే బిజెపిపై రేవంత్‌రెడ్డి బురద

## మీడియాతో చిట్‌చాట్‌లో

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 8:** రాబోయే బల్దియా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిజెపిని టార్గెట్ చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభిప్రాయ పడ్డారు. బల్దియాలో ఎన్నికలలో బిజెపి బలం ఏమిటో ముఖ్యమంత్రికి బాగా తెలుసు కాబట్టే, ఈ మధ్య పొద్దున లేస్తే బిజెపిపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఫిలిమ్ నగర్ కల్చరల్ క్లబ్‌లో సోమవారం కిషన్‌రెడ్డి మీడియా సమావేశం అనంతరం ఆయన చిట్ చాట్ చేశారు. తెలంగాణ పట్ల కేంద్రం ఎలాంటి వివక్ష చూపకపోయినప్పటికీ రాజకీయ కోణంలోనే సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని అన్నారు. నిన్నటికి నిన్న ఉత్తర తెలంగాణ జిల్లాలకు రోడ్ల విస్తరణతో పాటు వివిధ ప్రాజెక్టులకు వేలాది కోట్లు ఇచ్చిందని, అంతకు ముందు ప్రధాని మోదీ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా దాదాపు పది వేల కోట్ల వ్యయం చేసే ప్రాజెక్టులకు నిధులు ప్రకటించారని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.

ఒక్క నెల రోజుల వ్యవధిలో కేంద్రం తెలంగాణకు రూ. 20 వేల కోట్ల మేరకు వివిధ ప్రాజెక్టులకు నిధులు ప్రకటించిందని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. దొడ్డు వడ్ల బియ్యాన్ని ఎవరు తినడం లేదనే పౌర సరఫరాల శాఖ ద్వారా సన్న బియ్యం ఇస్తున్నామని ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం చెబుతూనే, కేంద్రాన్ని దొడ్లు వడ్లు కొనాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఎవరు తినని దొడ్డు వడ్లను కేంద్రం మాత్రం కొని ఏమి చేసుకోవాలని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కేంద్రం ధాన్యం కొనుగోలు చేయడం లేదని విమర్శించే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సన్నవడ్లకు ఇస్తామన్న రూ. 500 బోనస్సు మాత్రం ఇవ్వడం లేదన్నారు.

ఏదో ఆరంభశూరత్వంగా గొప్పగా బోనస్సు ఇస్తామని ప్రకటించి ఆ తర్వాత ఎగబెట్టిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. వచ్చే ఎన్నికలలో బిజెపి ఒంటరిగానే పోటి చేస్తుందా? అని మంత్రిని అడిగిన ప్రశ్నకు పక్కనే ఉన్న బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు స్పందిస్తూ, ఆ విషయంలో ఇప్పటికీ అదేమాట మీద ఉన్నామన్నారు. అయితే అంతిమంగా తమ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడక తప్పదన్నారు. పార్టీలు మారడంలో, ఢిల్లీకి డబ్బుల సంచులు మోయడంలోనూ, ప్రజలను తప్పుదోవ పట్టించడంలోనూ రేవంత్‌రెడ్డికి మించినవారు లేరని కిషన్‌రెడ్డి వ్యంగ్యంగా అన్నారు.

# మృగశిర ఎఫెక్ట్.. కళకళ్లాడిన చేపల మార్కెట్లు

## భారీగా ధర పెంచేసిన వ్యాపారులు

### అదనంగా రూ.100 నుండి రూ.300 వరకూ పెంపు

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** మృగశిర కార్తె రోజున చేపలు తినడం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక ఆనవాయితీగా వస్తోంది. ఈ రోజున చేపలు తింటే ఆస్తమా, శ్వాసకోశ సమస్యలు దూరమవుతాయని, ఆరోగ్యం బాగుంటుందని ప్రజల బలమైన నమ్మకం. దీంతో మృగశిర కార్తె ప్రవేశించిన సోమవారం చేపల మార్కెట్లలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. దీంతో వ్యాపారులు సాధారణ రోజుల కన్నా రెట్టింపు ధరలకు పెంచి విక్రయించారు. చేపల మార్కెట్లకు ఆదివారం నుండి రద్దీ పెరిగింది. మృగశిర పర్వదినం సందర్భంగా స్థానిక చేపల మార్కెట్లలో కొనుగోలుదారుల తాకిడి ఎక్కువగా ఉండి కిటకిటలాడాయి. మార్కెట్ అంతటా కొనుగోలుదారుల సందడి నెలకొంది. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా మంచి డిమాండ్ ఏర్పడింది. ఉదయం నుంచే ప్రజలు వచ్చి చేపలు కొనుగోలు చేస్తున్నారు.

పెద్ద చేపలకు కూడా మంచి ఆదరణ లభించింది. దీంతో చేపలకు భారీ డిమాండ్ ఏర్పడింది. హైదరాబాద్‌తో పాటు, రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ చేపల మార్కెట్లు కిక్కిరిసిపోయాయి. నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్డుతో పాటు, సూర్యాపేటలోని చేపల మార్కెట్, ఖమ్మం బొమ్మ, కుడకుడ రోడ్లలోని చేపల విక్రయ కేంద్రాలలో మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం ఒకరోజు ముందుగానే సందడి నెలకొన్నది. హైదరాబాద్‌లోని రాంనగర్,

ముషీరాబాద్ వంటి ప్రముఖ మార్కెట్లలో టన్నుల కొద్దీ చేపలు అమ్ముడయ్యాయి. రవ్వ, బొచ్చె తదితర రకాల నాటు చేపలు మొదలుకొని, కొరమీను, రొయ్యలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఏర్పడింది. డిమాండ్ ఎక్కువగా ఉండటం వల్ల సాధారణ రోజులతో పోలిస్తే చేపల ధరలు భారీగా పెరుగుతాయి. సాధారణంగా కిలో రూ.120 నుండి రూ.130 ఉండే రవ్వ చేపలు రూ.230 నుండి రూ.350 వరకు, రూ.450 ఉండే కొరమీను రూ.650 పైబడి పలికాయి. బొమ్మ చేపను రూ.450 చొప్పున విక్రయించారు. అరకిలో నుంచి ఐదు కిలోల వరకు బరువున్న చేపలను వ్యాపారులు మార్కెట్‌కు తీసుకువచ్చారు. చేపల కోసం ప్రజలు పోటీపడి కొనుగోలు చేయడంతో వ్యాపారులు కూడా మంచి అమ్మకాలు జరిగాయని ఆనందం వ్యక్తం చేశారు.

# పంటల్లో వైవిధ్యం అనివార్యం

## నీటి వనరుల రక్షణే ధ్యేయం

## వరికి బదులు లాభదాయక ప్రత్యమ్నాయం

## సుస్థిర సాగుకు తప్పని పంటల మార్పిడి

### ప్రభుత్వానికి రైతు సంక్షేమ కమిషన్ నివేదిక

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** ఈ యేడాది ఖరీఫ్ సీజనులో రైతులకు మరింత కష్టాలు ఎదుర్యే పరిస్థితులు తలెత్తనున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పులు పంటల సాగుకు ముప్పును కలిగించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఎన్‌లినో ప్రభావంతో ఈ ఖరీఫ్ సీజనులో వర్షా భావ పరిస్థితులు ఏర్పడనున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ నీటిని వినియోగించే పంటలకు బదులు ప్రత్యమ్నాయ పంటలవైపు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ సైతం సూచించింది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సాగుకు సంబంధించి రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ ఒక నివేదికను రూపొందించి ప్రభుత్వానికి తాజాగా సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం రాష్ట్రంలో వ్యవసాయం సుస్థిరంగా ఉండాలంటే రైతులు తాము పండించే పంటలను వైవిధ్యపరచాలి. వరి సాగు నుండి వైదొలగే ఈ మార్పును ప్రోత్సహించడానికి ప్రభుత్వ మద్దతు అవసరమని, దీనివల్ల నీటి వనరులను పరిరక్షించడం కూడా సాధ్యమవుతుంది. పంటల వైవిధ్యీకరణపై ప్రభుత్వానికి సమర్పించిన కమిషన్ నివేదిక, రైతులు వరి పంటకు అధికంగా ప్రాధాన్యత ఇవ్వడానికి గల కారణాలలో కనీస మద్దతు ధర హామీ అని పేర్కొంది. ఖరీఫ్, రబీ సీజన్లలో వరి సాగు విస్తీర్ణం 2013-14లో 49,28,000 ఎకరాల నుండి 2024-25 నాటికి 1,27,03,000 ఎకరాలకు పెరిగింది. దీనికి అదనంగా, రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు బోనస్ ఇస్తామని కూడా వాగ్దానం చేసింది. దీంతో రైతులు వీటినే అత్యధికంగా సాగు చేస్తున్నారు.

రాష్ట్రంలో వరి, పత్తి రెండు ప్రధాన పంటలుగా ఆవిర్భవించినప్పటికీ, దీర్ఘకాలంలో వాటిపై ఆధారపడటం ఆర్థికంగా గానీ, పర్యావరణపరంగా గానీ సుస్థిరం కాదు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత వ్యవసాయం దారి తప్పిందని ప్రకటిస్తూ, వరి నుండి ప్రత్యామ్నాయ పంటలకు మారడం వల్ల నీటి సంరక్షణ కూడా సాధ్యమవుతుందని, అలాగే ప్రత్యామ్నాయ పంటలకు లాభదాయకమైన ధరలు లభించడం ద్వారా రైతులు లబ్ధి పొందగలరని నివేదికలో స్పష్టం చేసింది.

రాష్ట్ర స్థాయి ధరల నిర్ధారణ కమిటీ సిఫార్సుల ఆధారంగా చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనెగింజలు వంటి ప్రత్యా మ్నాయ పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటిం చాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలి పింది. ఒక సీజన్‌లో వరి పండించాలనుకునే రైతులను తర్వా తి సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటకు మారేలా ప్రోత్సహించడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఒక జిల్లా ఒక ఉత్పత్తి ప్రణా ళిక వాతావరణ, నీటి, నేల పరిస్థితుల ఆధారంగా ప్రభుత్వం ఒక జిల్లాకు ఒక ఉత్పత్తి విధానాన్ని ప్రవేశపెట్టి, ఆయా జిల్లాలకు అత్యంత అనువైన పంటను పండిం చడంపై దృష్టి పెట్టేలా రైతులను ప్రోత్సహించాలి.

# సిఎం రేవంత్ హిట్లర్ కన్నా ఎక్కువ: కల్వకుంట్ల కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 8:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్ మాత్రమే కాదు అంతకన్నా ఎక్కువ అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఆడపిల్లలు, పేదలకు చదువును దూరం చేస్తున్న ఆయన తాలిబాన్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదిస్తామన్న సిఎం రేవంత్ రెడ్డిపై ఆమె ఫైర్ అయ్యారు. తాలిబాన్‌లు ఆడబిడ్డలకు చదువు దూరం చేశారని.. అదే తరహాలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ స్కూళ్లను మూసేసి ఆడపిల్లలు, పేదలకు చదువులు అందకుండా చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 27 వేల స్కూళ్లలో పని చేస్తున్న 3 లక్షలకు పైగా ప్రభుత్వ టీచర్లను ఏం చేస్తారో చెప్పాలని నిలదీశారు. క్రమేణ విద్యను పేదలకు దూరం చేసి ప్రైవేటీకరించడానికి సిఎం తెరతీస్తున్నారని విమర్శించారు. విద్యాశాఖపై రేవంత్ రెడ్డి పట్టు కోల్పోయారని ఆరోపించారు. స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి హయ్యర్ ఎడ్యుకేషన్ వరకు అన్నింటా వైఫల్యాలే అని పేర్కొన్నారు. విద్యాశాఖను రేవంత్ రెడ్డి సర్కస్ లెక్క మార్చేశారని విమర్శించారు. ఈ యేడాది నుంచే ఇంటర్మీడియట్ ఉండదు.. ప్లస్ 2 విధానం తెస్తానని సిఎం ప్రకటించిన మరుసటి రోజే ఇంటర్ బోర్డు అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తు చేశారు.

# కాంగ్రెస్‌ది హిట్లర్ మనస్తత్వం

## ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్ కోసం

## రేవంత్ కార్యాలయం నుంచి అభ్యర్థన వెళ్లలేదు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ మనస్తత్వమే హిట్లర్ మనస్తత్వమని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాల యంలో మీడియాతో మాట్లా డారు. రాజ్యాంగం, రా జ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వా మ్య సంస్థల మీద కాంగ్రెస్ పార్టీకి నమ్మకం లేదని, అందుకే ఇందిరా గాంధీ ఆనాడు దేశంలో ఎమర్జెన్సీ విధించారని అన్నారు. ఈరోజు కూడా కాంగ్రెస్ పార్టీని ఒకే కుటుంబం నడుపుతుందని,



అధ్యక్షుడు ఎవరైనా కావచ్చు, కానీ నిర్ణయాలు మాత్రం ఒకే కుటుంబం చుట్టూ తిరుగుతున్నాయన్నారు. అదే నియంతృత్వ ధోరణిని తెలంగాణలో కూడా అమలు చేయాలని చూస్తున్నారి అన్నారు. కాంగ్రెస్ పార్టీ హిట్లర్ మనస్తత్వంతో వ్యవహరిస్తుందని, వారి తీరు చూస్తే 'జో హిట్లర్ కి చాల్ చలేగా, ఓ హిట్లర్ కి మోత్ మరేగా' అనే నినాదం గుర్తుకు వస్తుందన్నారు. ఓబిసి వర్గానికి చెందిన ప్రధానమంత్రి, గిరిజన మహిళ అయిన రాష్ట్రపతికి గౌరవం ఇవ్వడం కూడా ఇబ్బందిగా భావించడం సరైంది కాదన్నారు. మోడీ సభ విజయవంతమైన తర్వాత వచ్చిన నివేదికలతో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బలపడుతోందనే విషయం కాంగ్రెస్‌కు స్పష్టమైంది. అందుకే బిజెపిపై అసహనం, ఆందోళన పెరిగింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ ఫుడ్ గ్రెయిన్స్ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా సేకరించిన ధాన్యంలో 104.41 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటే, అందులో తెలంగాణ నుంచే 55.31 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించబడ్డాయి. అంటే దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యంలో సగానికి పైగా తెలంగాణ నుంచే ఉంది.

ఎంఎస్పీ కింద దేశవ్యాప్తంగా రైతులకు చెల్లించిన మొత్తం సుమారు రూ.21,243 కోట్లు కాగా, అందులో తెలంగాణ రైతులకు మాత్రమే రూ.13,171 కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయి. ఎంఎస్పీ ప్రయోజనం పొందిన రైతుల సంఖ్య దేశవ్యాప్తంగా 11.69 లక్షల మంది కాగా, అందులో 7,79,358 మంది తెలంగాణ రైతులే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్ విషయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారు. నేను స్వయంగా ఫడ్నవీస్ కార్యాలయానికి ఫోన్ చేశాను. నెల రోజుల క్రితం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తరఫున ఏదో ఒక అభ్యర్థన వెళ్లిందని చెప్పారు. కానీ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక అపాయింట్‌మెంట్ అభ్యర్థన రాలేదని స్పష్టం చేశారు.

# పాత సింగరాయకొండ బావిలో లభ్యమైన మృతదేహం

## హైదరాబాద్‌లో బిటెక్ విద్యార్థి రాహుల్‌గా గుర్తింపు

### ర్యాగింగ్ అనుమానాలు.. రాహుల్ మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు

**సింగరాయకొండ, జూన్ 8, ప్రభాతవార్త:** మండలం లోని పాత సింగరాయకొండ గ్రామంలో వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన పూలతోటలోని వాడుకలో లేని బావిలో ఇటీవల లభ్యమైన గుర్తుతెలియని యువకుడి మృతదేహం కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. హైదరా బాద్‌లో అదృశ్యమైన బీటెక్ విద్యార్థి రాహుల్‌గా మృతుడిని కుటుంబ సభ్యులు గుర్తించినప్పటికీ, డీఎన్ఏ పరీక్షల అనంతరమే పూర్తి నిర్ధారణకు వచ్చే అవకాశ ముందని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన రాహుల్ హైదరాబాద్‌లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మే 27న ఇంటికి వెళ్తున్నానని చెప్పి స్నేహితుడు బైక్ మీద కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు నాలుగు రోజులైన ఇంటికి రాకపోతే అంత గాలించి ఎక్కడ ఆచూకీ కనపడక పోవడంతో మే 31 కాచిగూడ పోలీస్ స్టేషన్ లో తండ్రి రాజేష్ పిర్యాదు చేయడం తో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దీనితో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రైల్వే స్టేషన్‌లో శబరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిం చినట్లు సీసీటీవీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. ఇదిలా ఉండగా, మే 30న సింగరాయకొండలోని స్వామివారి తోట బావిలో అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం లభించింది. మృతుడి వద్ద ఉన్న ఎర్రటి టీషర్ట్, మెడలోని ఆంజనేయస్వామి లాకెట్ తదితర ఆధారాలను పోలీసులు సోషల్ మీడియా, పత్రికల ద్వారా ప్రచారం చేశారు. ఈ సమాచారం రాహుల్ కుటుంబ సభ్యులకు చేరడంతో వారు సింగరాయకొండకు వచ్చి ఆధారాలను పరిశీలించి మృతుడిని తమ కుమారుడిగా గుర్తించారు. సోమవారం తెలంగాణ, సింగరాయకొండ పోలీ సులు కుటుంబ సభ్యులతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహం లభ్యమైన బావితో పాటు ఖననం చేసిన ప్రదేశాన్ని కూడా వారికి చూపించారు.

**ర్యాగింగ్ కోణంపై కుటుంబసభ్యుల అనుమానం..**

రాహుల్ తండ్రి అంకం రాజేష్ మాట్లాడుతూ, తన కుమారుడు హాస్టల్ నుంచి అదృశ్యమైన తర్వాత మిస్సింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. వందల కిలోమీటర్ల దూరంలోని సింగరాయ కొండకు రాహుల్ ఎలా చేరుకున్నాడనే విషయంపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ఇది ఆత్మహత్యా, హత్యా అన్నది తేల్చాలని, కాలేజీలో ర్యాగింగ్‌కు సంబంధించిన అంశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని పోలీసులను కోరారు. సీఐ శ్రీహరి మాట్లాడుతూ మే 30న బావిలో గుర్తించిన మృతదేహాన్ని యువనేస్తం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో బయటకు తీసి పోస్టు మార్టం, ఫోరెన్సిక్ అనంతరం ఖననం చేసినట్లు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ఆధారంగా ప్రచారం చేయడంతో కుటుంబ సభ్యులు స్పందించారని చెప్పారు. మృతదేహం వద్ద లభించిన టీషర్ట్, లాకెట్ తదితర వస్తువులను కుటుంబ సభ్యులకు చూపించగా, వారు రాహుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. మృతికి గల కారణాలపై ఆత్మహత్య, హత్యతో పాటు ఇతర అన్ని కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోందని, విచారణ పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడి స్తామని సీఐ తెలిపారు.

**నైపుణ్య పరీక్ష మరియు ఆచరణాత్మక ప్రదర్శన బోధనా తరగతి (వాక్-ఇన్-ఇంటర్వ్యూ)**

కాంట్రాక్టు పద్ధతిలో TGT (హిందీ/సంస్కృతం), TGT (స్పెషల్ ఎడ్యుకేటర్), TGT (తెలుగు), TGT (బయో/కెమిస్ట్రీ), TGT (ఇంగ్లీష్), PRT (EMS) పోస్టుల కొరకు నైపుణ్య పరీక్ష మరియు ప్రాక్టికల్ డెమో టీచింగ్ క్లాస్ (వాక్-ఇన్-ఇంటర్వ్యూ) 18-06-2026 తేదీన ఉదయం 8.00 గంటలకు అటామిక్ ఎనర్జీ సెంట్రల్ స్కూల్, మణుగూరు, HWP(M) కాలనీ, అశ్వాపురం, భద్రాద్రి-కొత్తగూడెంలో నిర్వహించబడుతుంది.

మరిన్ని వివరాల కోసం :
వెబ్ సైట్: www.aecsmanuguru.edu.in
కాంటాక్ట్ ఇ-మెయిల్ : aecsmanuguru@yahoo.co.in
కాంటాక్ట్ : 08746-232423, 08746-232420

CBC 48115/11/0026/2627

